క్లుప్తంగా

ఘనంగా శాంతలింగేశ్వర స్వామి అనుష్టానోత్సవం



పూజలు నిర్వహిస్తున్న నాల్వడి శాంతలింగేశ్వర స్వామి

బ్రహ్మసముద్రం : ముప్పలకుంటలో ముమ్మడి శాంతలింగేశ్వరస్వామి తపోక్షేత్రంలో 26 వ అనుష్టానోత్సవం సోమవారం నిర్వహించారు. వేడుకకు కేధార్ నాథ్ ఆలయ ఆస్థాన స్వామీజీ నాల్వడీ శాంతలింగేశ్వరస్వామి హాజరయ్యారు. సోమవారం ఉదయం నుంచి స్వామి తపోక్షేత్రంలో కుంభాభిషేకం, గంగపూజ, ధ్వజారోహణం, గణపతి పూజ , నవగ్రహ పూజ నిర్వహించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మనిషి జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. వీరశైవ లింగాయత్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన క్యాలెండర్లు ఆవిష్కరించారు. స్వామిని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జెడ్పీటీసీ ప్రభావతి దర్శించుకున్నారు.

భూముల అక్రమాలపై ఫిర్యాదు



తహసీల్దార్ బాలకిషన్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: గాలిమరలు, సోలార్ కంపెనీల ఏర్పాటుపై గ్రామసభలు నిర్వహించకుండానే భూములు ఎలా కొంటారని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు బీమేష్, జిల్లా నాయకులు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, డాక్టర్ బొమ్మయ్య తదితరులు తహసీల్దార్ బాలకిషన్‌ను అడిగారు. సోమవారం వారు తహసీల్దార్‌ను కలిసి గాలిమరలు, సోలార్ ఏర్పాటుకు భూముల కొనుగోలు విషయంలో అక్రమాలపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కొందరు దళారులు రైతుల నుంచి తక్కువ ధరలకే భూములు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విల్సన్, అచ్చంపల్లి నాగరాజు, రాజు, పవన్ పాల్గొన్నారు.

ఎల్‌సీడీసీ సర్వే పర్యవేక్షణ



మోపిడిలో ఎల్‌సీడీసీ సర్వేను పర్యవేక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

ఉరవకొండ: రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన లెప్రసీ కేస్ డిటెక్షన్ (కుష్టు వ్యాధి గుర్తించే కార్యక్రమం) ను రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పావని, వెంకటేష్, సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫీలు సోమవారం పర్యవేక్షించారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమలో ఎంపీహెచ్‌ఎస్ శేఖర్, ఏఎన్‌ఎం అనూష పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ కేర్ సెంటర్‌లో సౌకర్యాలు మెరుగుపర్చండి



చిల్డ్రన్ లర్నింగ్ ఇన్‌స్టిట్యూషన్‌ను సందర్శించిన జిల్లా పర్యవేక్షణ కమిటీ

కణేకల్లు: ఆర్డీటీ హోం, చిల్డ్రన్స్ కేర్ సెంటర్‌లో సౌకర్యాలు మెరుగుపరచండి అని జిల్లా బాలల సంరక్షణ అధికారి మంజునాథ్ తెలిపారు. కణేకల్లుక్రాస్ ఆర్డీటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్డీటీ హోం, చిల్డ్రన్స్ కేర్ సెంటర్లను జిల్లా పర్యవేక్షణ కమిటీ సోమవారం సందర్శించింది. జిల్లా ప్రొబేషన్ అధికారి ఫరూక్ బాషా, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ప్రొటెక్షన్ అధికారి వెంకటేశ్వరితో కలిసి జిల్లా బాలల సంరక్షణ అధికారి కేంద్రాలను సందర్శించారు. బాయ్స్, గర్ల్స్‌కు వేర్వేరు సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.రెండు కేంద్రాల నిర్వహణపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కంబదూరు:కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం సీసాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ సునిల్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ, హెడ్ కానిస్టేబుల్ ఫణీంద్ర కంబదూరు చెక్‌పోస్టులో సోమవారం తనిఖీలు నిర్వహించారు. కళ్యాణదుర్గానికి చెందిన ఓ మహిళ అట్టపెట్టెల్లో తరలిస్తున్న 288 హైవార్డ్స్ విస్కీ, 192 రాజ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు మారుతి, సందీప్ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: విరుపాపల్లి క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం కళ్యాణదుర్గం ఎక్సైజ్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ జయనాథ్‌రెడ్డి, ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. విరుపాపల్లి క్రాస్ వద్ద బోయ రాము అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని నుంచి 15 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈకేసులో గొల్ల శివ, బోయ మురళీలను అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు.

ఖరీఫ్‌లో వేరుశనగతోపాటు ప్రత్యామ్నాయంగా ఎంతో ఆశతో సాగు చేసిన కంది రైతు కన్నీరు పెడుతున్నారు. గతంలో ధర ఆశించిన స్థాయిలో ఉన్నా.. రోజులు గడుస్తున్న కొద్దీ తగ్గుముఖం పడుతోంది.. పంట చేతికొచ్చి పక్షం రోజులవుతున్నా కూటమి సర్కారు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో తాత్సారం చేస్తోంది. దీంతో రైతులు కంది ఉత్పత్తులను ఇళ్లలో, కల్లాలోనూ నిల్వ ఉంచుకోలేక, బయటి మార్కెట్‌లో విక్రయించుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ తీరును చూసి కంది రైతుల పరిస్థితి ‘ అమ్ముకోవాలా..? లేక నిల్వ ఉంచుకోవాలా? ’ అన్న చందంగా మారింది.

రాయదుర్గం:





కంది రైతుకు కలవరం

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో కూటమి సర్కార్ తాత్సారం
- అంచనాలకు మించి సాగైన కంది పంట
- బయట మార్కెట్లో రూ.6,200కే కొనుగోలు
- ప్రభుత్వం ఇస్తామంటున్న ధర క్వింటా రూ.7550
- అమ్ముకోలేక నిల్వ ఉంచుకోలేక రైతుల సతమతం



రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో గతేడాది ఖరీఫ్‌లో అంచనాలకు మించి కంది పంట సాగులోకి వచ్చింది. 18,553 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా, ఏకంగా 61,769 హెక్టార్లు అంటే 26,372 హెక్టార్లలో అధనంగా సాగు అయ్యింది. 44,925 మంది రైతులు ఈ–క్రాప్ నమోదు చేశారు. ఇందులో అత్యధికంగా ఉరవకొండలో 38,188 హెక్టార్లలో కంది సాగులోకి వచ్చింది. దిగుబడి కాస్త ఆశాజనంగా ఉంది. పదిహేను రోజుల క్రితం బయట మార్కెట్లో క్వింటా కందుల ధర రూ.8,500 నుంచి రూ.9 వేలు పలికింది. వారం రోజుల నుంచి తగ్గుతూ రూ.6,200 నుంచి రూ.6,400కు చేరుకుంది. ప్రస్తుతం క్వింటాపై ఏకంగా రూ.2 వేలు తగ్గింది.

70 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా...

జిల్లా వ్యాప్తంగా 37,366 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా, 1,03,429 హెక్టార్లలో కంది పంట సాగు అయ్యింది. ఇందులో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండలో మెజార్టీ సాగు విస్తీర్ణం ఉంది. సుమారు 70 వేల మెట్రిక్ టన్నుల దిగుబడిపై ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ అంచనాకు వచ్చింది. 31 మండలాల్లోనూ పీఏసీఎస్, ఎఫ్‌టీఓ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో తొలుత 45 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు సిద్ధమైంది. ఈ దిశగా ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది.

మద్దతు ధరకోసం ఎదురుచూపు..

బయట మార్కెట్లో క్రమంగా కంది ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ప్రభుత్వం క్వింటా కంది ధర రూ.7,550 ప్రకటించింది. కొనుగోలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారో చెప్పకుండా దాటవేస్తున్నారు. కష్టపడి పండించిన పంట ఉత్పత్తులు విక్రయించేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోందని రైతులు మండిపడుతున్నారు.

మద్దతుకు మించిన ధరతో కొనుగోలు ..

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి గతేడాది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల నుంచి నేరుగా కందులు కొనుగోలు చేసింది. అదీ మద్దతు ధరకు మించి.. మార్కెట్ రేటు కంటే అదనంగా ధర చెల్లించి, కంది రైతుల కష్టాలు తీర్చింది. సకాలంలో జనవరి మొదటి వారంలోనే కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఏరోజుకారోజు మార్కెట్‌లో ఉన్న ధరకే రూ.9,500 నుంచి రూ.10 వేలతో కొనుగోలు చేసింది. కేవలం రెండు మూడు రోజుల్లోనే రైతు ఖాతాలకు నగదు జమ చేశారు. ప్రస్తుతం కూటమి సర్కార్ ఆదిశగా చర్యలు చేపట్టలేకపోయింది.

రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో సాగైన కంది పంట వివరాలు..

నియోజకవర్గం	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లు)	సాగైన కంది విస్తీర్ణం (హెక్టార్లు)	రైతులు
రాయదుర్గం	1,902	9,577	7,522
కళ్యాణదుర్గం	4,054	14,004	10,522
ఉరవకొండ	12,597	38,188	26,883
మొత్తం	18,553	61,769	44,925

ఎదురుచూపులే



ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నాం. ఎప్పుడో పక్షం రోజుల క్రితం పంట చేతికందినా అమ్ముకోలేని పరిస్థితి. బయట మార్కెట్లో తక్కువ ధరలు పలకడం, ప్రభుత్వం ప్రకటించిన ధర ఎక్కువ ఉండడంతోనే నిల్వలు పేరుకుపోయాయి. ఒకటి రెండు రోజుల్లోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి.

– మహేష్, రైతు, తాళ్లకెర

త్వరలో కొనుగోలు కేంద్రాలు

కంది కొనుగోలు కేంద్రాలు త్వరలో తెరిచేలా చర్యలు చేపట్టాం. 31 మండలాల్లోనూ కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తున్నాయి. జిల్లాలో 70 వేల మెట్రిక్ టన్నుల కంది దిగుబడి రావచ్చని అంచనా ఉంది. తొలి దశలో 45 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు చర్యలు చేపట్టాం. రైతుల డిమాండ్ బట్టి పెంచుతూ పోతాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– పెన్నేశ్వరి, ఏపీమార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, అనంతపురం

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



జేసీబీతో వెంచర్‌లో మట్టిని వేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ ప్రాంతంలో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టణానికి సమీపంలోని చిన్నముష్టూరు, ఇంద్రావతి, మోపిడి గ్రామాల నుంచి హంద్రీనీవా ప్రధాన కాలువ గట్ల మట్టి తవ్వి ఉరవకొండ చుట్టూ వెలిసిన అనధికార వెంచర్లకు తరలించి, రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. అనంతపురం–బళ్లారి 42వ జాతీయ రహదారిపై అనంతపురం వైపు హంద్రీనీవా ప్రధాన కాలువ వెళ్తుంది. కాలువ మట్టి ఎర్రమట్టి కావడం అత్యంత నాణ్యతగా ఉండటంతో దోపిడీదారుల కన్ను పడింది. దీంతో 20 జేసీబీలు ఏర్పాటు చేసి, వందలాది ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.1200 చొప్పున, ట్రక్కుతో అయితే రూ.6 వేల నుంచి రూ. 8 వేల ధర నిర్ణయించి అమ్ముకుంటున్నారు. ఉరవకొండ చుట్టూ అక్రమ వెంచర్లు వెలుస్తుండటంతో మట్టి రోడ్లు, ప్రహరీలు నిర్మించేందుకు ఎర్రమట్టి అవసరమైనందున అధికార పార్టీ నేతల పేర్లు చెప్పుకుంటూ పెద్ద ఎత్తున జేసీబీలతో మట్టి తరలిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ హంద్రీనీవా మట్టిని అక్రమంగా తరలించడం నేరమన్నారు. మట్టిని తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, హంద్రీనీవా కాలువ దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. మట్టి తరలింపును అడ్డుకొని బాధ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఉరవకొండ: ఉచిత పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ డీడీ జి.వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలోని చిన్నముష్టూరు, విడపనకల్లులో ఉచిత పశువైద్య శిబిరాలను ప్రారంభించారు. ఏడీడీ పెద్దన్న, పశువైద్యాధికారులు శ్రీవిద్య, ఉమామహేశ్వర పాల్గొన్నారు.

వజ్రకరూరు: జరుట్ల రాంపురంలో పశు ఆరోగ్య శిబిరాన్ని పశు వైద్యాధికారి కృష్ణమూర్తినాయక్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సర్పంచు తిరుపాల్ యాదవ్, జేవీఓ భద్రు నాయక్, ఏహెచ్‌ఎస్‌లు రఫి, వెంకటేష్, నాగరాజు, గోపాల్‌మిత్ర పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: పశువులకు ముందస్తుగా వ్యాధులు రాకుండా టీకా వేయించాలని పశువైద్యులు నవీన్‌కుమార్ తెలిపారు. దేవరెడ్డిపల్లి, మారెంపల్లి గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది దివ్యభారతి, మాంతేష్, లక్ష్మీనారాయణ, భవ్యశ్రీ, ఫక్కీరప్ప పాల్గొన్నారు.

కూడేరు: కూడేరులో పశువైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌ఎస్‌ఏ భాగ్యలక్ష్మి, ఏహెచ్‌ఏలు భవాని, దామోదర్, రఘు వర్ధన్, యశోధ, రామాంజనేయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులపై నిర్లక్ష్యం వీడాలి

- కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం డివిజన్లో జరిగిన రెవెన్యూ సదస్సులలో రైతుల నుండి అందిన ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఆర్డీఓ వసంతబాబు చెప్పారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. పలు మండలాల నుండి భూ సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. డివిజన్‌లోని అన్ని మండల స్థాయి సమస్యలను గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్జీదారులకు న్యాయం చేయాలని సూచించారు. అధికారులు పాల్గొన్నారు.

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువైంది. డీటీ సూర్య ప్రతాప్, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఏఓ విజయకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ హాజరయ్యారు. మిగిలిన అధికారులు డుమ్మాకొట్టారు. అధికారులు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు వినతులు ఇవ్వడానికి ఆసక్తి చూపడంలేదు. సుముఖత వ్యక్తంఅధికారులు సరిగా రారు. భూ సమస్యలపై మూడు అర్జీలు మాత్రమే వచ్చాయి.

కంబదూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు తహసీల్దార్ బాలకిషన్, ఈఓపీఆర్డీ గూడెన్న మాత్రమే హాజరయ్యారు. మిగిలిన అధికారులు డుమ్మా కొట్టారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు.

కళ్యాణదుర్గం మున్సిపల్ బడ్జెట్ ఆమోదం



స్కార్పియో వాహనానికి నిప్పు పెట్టారని ఎమ్మెల్యే అమిలినేని దృష్టికి తెచ్చిన కౌన్సిలర్ అర్చన

కళ్యాణదుర్గం: స్థానిక మున్సిపాలిటీలోని రెండేళ్లకు సవరించిన బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో చైర్మన్ రాజ్‌కుమార్ అధ్యక్షతన 2024–25, 2025–26కు సంబంధించి సవరించిన బడ్జెట్ సమావేశం జరిగింది. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ బడ్జెట్ వివరాలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం 2024–25 ఏడాదికి ప్రారంభ నిల్వ, సవరించిన అంచనాలను వివరించారు. 2024–25 సవరించిన అంచనాలు మొత్తం రూ.20,75,18,193 కాగా,2025–26 బడ్జెట్ అంచనాలు రూ. 46,33,08,193గా తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి రాజకీయాలకతీతంగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు జయం ఫణి, పూజారి తిమ్మప్ప, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, కుర్రారాము, సు. దీప్తి, గోపారం హేమావతి, అర్చన, చంద్రమ్మ, కోఆప్షన్ సభ్యులు అఫ్జల్, మారుతి పాల్గొన్నారు.

కక్షసాధింపుతోనే వాహనానికి నిప్పు : టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు కక్ష సాధింపుతోనే తన స్కార్పియోకు నిప్పు పెట్టారని 23వ వార్డు కౌన్సిలర్ అర్చన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నడూ లేని విధంగా కొత్త సంస్కృతికి తెర లేపడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు దురదృష్టకరమన్నారు.

మహిళా కౌన్సిలర్‌కు అవమానం: మున్సిపల్ కార్యాలయంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఏడో వార్డు కౌన్సిలర్ ఐ.సుదీప్తికి అవమానం జరిగింది. సమావేశానికి ముందుగా వెళ్లిన కౌన్సిలర్ మహిళల వరుసలో ముందువైపు కూర్చున్నారు. అయితే కొద్దిసేపటికి కౌన్సిల్ సమావేశానికి హాజరైన 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్ పూజారి తిమ్మప్పకు ముందు వరుసలో కూర్చునేలా మున్సిపల్ కార్యాలయ ఉద్యోగి సుదీప్తిని కుర్చీ నుంచి పైకి లేపారు. అనంతరం ఆమె మరో కుర్చీలో కౌన్సిల్ హాల్‌లో కూర్చుండిపోయింది. ఒక మహిళ కౌన్సిలర్ అన్న కనీస గౌరవం ఇవ్వకుండా కార్యాలయ ఉద్యోగి వ్యవహరించడంపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మండిపడ్డారు.

తాగునీటి సమస్య తీర్చండి



నీటికోసం ఎమ్మెల్యేని నిలదీస్తున్న మహిళలు

కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలని రెవెన్యూ కాలనీ మహిళలు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును నిలదీశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన బడ్జెట్ సమావేశానికి హాజరై తిరిగి వెళ్తున్న ఎమ్మెల్యే వద్ద పలువురు మహిళలు తాగునీటి సమస్యపై ఏకరువు పెట్టుకున్నారు. సాయిబాబా ఆలయం వెనుక ప్రాంతంలో తాగునీరు సక్రమంగా సరఫరా కాలేదని వాపోయారు.

రీసర్వేకు ప్రతి రైతూ సహకరించాలి

కళ్యాణదుర్గం రూరల్: రీసర్వేకు ప్రతి ఒక్క రైతూ సహకరించాలని ఆర్డీఓ వసంత్‌బాబు కోరారు. సోమవారం మండలంలోని దురదగుంటలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను ఆర్డీఓ పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ సర్వే చేసే ప్రాంతంలో ముందుగానే రైతులకు సమాచారమివ్వాలని, స్పందించకుంటే మూడుసార్లు సమాచారం ఇవ్వాలన్నారు.

గుమ్మఘట్ట: గుమ్మఘట్టలో రీసర్వే పనులు సోమవారం ప్రారంభించినట్లు రీసర్వే డీటీ రఘు తెలిపారు. మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్.హొసళ్లి, పూలకుంట, రంగసముద్రం, గలగల గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు తెలిపారు. ఆర్ఐ రామాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూడేరు: భూ రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల రీసర్వే డీటీ ప్రసాద్, సర్వేయర్ ఆయేషా సిద్ధికీ తెలిపారు. సోమవారం జయపురంలో అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి రీ సర్వే చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు గోపాల్ , ఇమ్రాన్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : రీ సర్వే పక్కాగా చేపట్టాలి అని తహసీల్దార్ సుమతి అధికారులను ఆదేశించారు. సోమవారం గుండిగానిపల్లిలో రీసర్వే పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ రీ సర్వేను రెవెన్యూ సిబ్బంది పక్కాగా సర్వే చేయాలన్నారు. ఆర్ఐ నాగిరెడ్డి, మండల సర్వేయర్ సుకర్ణ, వీఆర్వోలు లక్ష్మన్న, మల్లికార్జున, అంజనేయులు, ఎర్రిస్వామి, విలేజ్ సర్వేయర్లు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లపై విచారణ



బేలోడులో వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలో దివ్యాంగుల్లో అనర్హుల పింఛన్లపై విచారణ నిర్వహించినట్లు ఎంపీడీఓ దాసానాయక్ తెలిపారు. ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక వైద్యబృందం సోమవారం 19 గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్ద కెళ్లి విచారణ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. మూడు బృందాలు 110 మంది దివ్యాంగుల పింఛన్లపై విచారణ చేపట్టారు.

పింఛన్‌దారులకు వైద్యపరీక్షలు

గుమ్మఘట్ట: మంచానికే పరిమితమైన పింఛన్‌దారులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలో 40 మంది పింఛన్‌దారులు ఉన్నట్లు ఎంపీడీఓ రామకృష్ణతెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్తేర్‌రాణి, రవిప్రకాష్ పర్యవేక్షణలో మంచానికే పరిమితమై రూ.15 వేలు పింఛన్ అందుకుంటున్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్‌ఓ మురళీధర్, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ జయరాములు, పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సూపర్‌వైజర్ ఆదిబయమ్మ పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



వడ్డే భీమేష్ (ఫైల్)

ఉరవకొండ: బూదగవికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డే భీమేష్ బాబు(48) గుండె పోటుతో సోమవారం మృతి చెందాడు. అనంతపురంలోని సవేరా ఆస్పత్రిలో గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ వై.విశ్వేశ్వరరెడ్డి సంతాపం తెలియజేశారు. భీమేష్ మృతి పార్టీకి తీరనిలోటు అని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో బూదగవి సర్పంచ్ ధనుంజయ, పార్టీ నాయకులు ఉన్నారు. మృతుడు భీమేష్‌కు భార్య శివగంగమ్మ, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కణేకల్లు: మండలంలో 21 నుంచి 30 వరకు స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు తెలిపారు. మగ్గురు డిజిటల్ అసిస్టెంట్లకు 8 కేంద్రాలను అప్పగించినట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం

కుష్టు వ్యాధి సర్వే ప్రారంభం

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో కుష్టు వ్యాధి నివారణ సర్వే సోమవారం ప్రారంభించినట్లు పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 2 వరకు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నట్లు ఆయన తెలిపారు. వైద్యులు బాలాజీనాయక్, సీహెచ్‌ఓ మురళీధర్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.


నాగేపల్లిలో రేపు ఊరుదేవర

కణేకల్లు: నాగేపల్లిలో బుధవారం ఊరుదేవర జరుగనుంది. గ్రామదేవత కొల్లాపురమ్మ ఆలయానికి పెయింటింగ్ వేసి, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బుధవారం జరిగే విందుకు బంధువు, మిత్రులను ఆహ్వానించారు. ఎస్ఐ నాగమధు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముదిగల్లుకు చెందిన ఆదినారాయణ అనే యువకుడు సోమవారం మృతిచెందాడు. ఈనెల 16న ద్విచక్రవాహన ప్రమాదంలో ఇతను గాయపడ్డాడు.

అనారోగ్యంతో మాజీ సర్పంచు మృతి



వన్నూరమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఉమా

కళ్యాణదుర్గం రూరల్: మానిరేవు మాజీ సర్పంచ్ వన్నూరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. వన్నూరమ్మ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, నాయకులు సోమవారం నివాళులర్పించారు. జెడ్పీటీసీ బొమ్మన్న, జిల్లా కార్యదర్శి తలారి సత్యప్ప, సర్పంచ్ చంద్రా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారంతో బెంబేలు

కళ్యాణదుర్గం రూరల్: కురాకులతోట గ్రామంలో సోమవారం రాత్రి ఎలుగుబంటి కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. కాలనీవాసులు కేకలు వేయడంతో ఎలుగుబంటి కొండ ప్రాంతంలోకి పారిపోయింది. ఇటీవల కాలంలో ఎలుగుబంట్లు, చిరుతల సంచారంతో జనం బెంబేలెత్తుతున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

కళ్యాణదుర్గం రూరల్: పలు దోపిడీ కేసుల్లో ముగ్గురు నిందితులను రూరల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. పలు దోపిడీ కేసులోని నిందితులు ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తిని పోలీసులు తిమ్మసముద్రం గ్రామ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.

ఎస్సీ కమిషన్ దృష్టికి మాదిగల సమస్యలు

కళ్యాణదుర్గం: జిల్లాలో మాదిగలపై జరుగుతున్న దాడులు, కుల వివక్ష, దౌర్జన్యాలను వన్ మెన్ కమిషన్ శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా దృష్టికి సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాజు తీసుకెళ్లారు. సోమవారం ఆయన అనంతపురంలోని కలెక్టరేట్‌లో మాదిగలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను తీసుకెళ్లారు. మాదిగలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు తోడ్పాటునందించాలని వినతి రూపంలో కోరారు.

ఉద్యోగాల నుంచి తొలగించకుండా చూడండి

వజ్రకరూరు: తమను తొలగించేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని మోడల్ స్కూల్ దినసరి కూలీలు ఎలిషమ్మ, నీలమ్మ, సరస్వతి, సుధారాణి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ నయాజ్ అహమ్మద్‌ను కలిసి విన్నవించారు.